క్లుప్తంగా

గోవుల అక్రమ రవాణాను అడ్డుకున్న పోలీసులు


పోలీసులు పట్టుకున్న గోవులు

టి.నరసాపురం: అక్రమంగా రవాణా చేస్తున్న గోవులను టి.నరసాపురం పోలీసులు అడ్డుకున్నారు. ఒక లారీలో విశాఖపట్నం జిల్లా నక్కపల్లి నుంచి అక్రమంగా హైదరాబాద్‌కు 12 గోవులను తరలిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు టి.నరసాపురం శివారులో తనిఖీలు నిర్వహించగా, లారీలో మూగజీవాలను తరలించడం గుర్తించారు. దీంతో గోవులను తరలిస్తున్న ముగ్గురిపై కేసు నమోదు చేసి, లారీని సీజ్ చేశారు. అలాగే పట్టుకున్న 12 ఆవులను హనుమాన్ జంక్షన్‌లోని గోశాలకు తరలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రైతులతో జేసీ సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న జేసీ పి.ధాత్రిరెడ్డి

పోలవరం రూరల్: జాతీయ రహదారి నిర్మాణానికి సేకరించే భూములకు సంబంధించిన రైతులతో జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి సమావేశం నిర్వహించారు. పోలవరం మండలం ఎల్ఎన్‌డీపేట, ప్రగడపల్లి గ్రామాల్లో రహదారి నిర్మాణానికి సేకరించే భూముల రైతులకు ఏమైనా సమస్యలు ఉంటే తెలియజేయాలన్నారు. ఎంతమంది రైతులు ఉన్నారు, ఎన్ని ఎకరాల భూమి సేకరించాల్సి ఉంది అనే విషయాలను తహసిల్దార్ ఆర్ఎస్ రాజును అడిగి తెలుసుకున్నారు. భూములు కోల్పోయిన రైతులకు నష్ట పరిహారం అందిస్తామన్నారు.

బౌద్ధాలయాలకు బస్సులు ఏర్పాటు చేయాలి


ఆర్టీసీ ఇన్‌చార్జి డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందిస్తున్న సహాయ ఫౌండేషన్ సభ్యులు

జంగారెడ్డిగూడెం: ప్రపంచ ప్రసిద్ధి చెందిన కామవరపుకోట మండలంలోని గుంటుపల్లి బౌద్ధాలయాల సందర్శనకు ప్రత్యేక ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేయాలని కోరుతూ ఇన్‌చార్జి డిపో మేనేజర్ చంద్రరావుకు సహాయ ఫౌండేషన్ ట్రస్ట్ సభ్యులు గురువారం వినతి పత్రం అందజేశారు. ప్రముఖ పుణ్యక్షేత్రాలైన ద్వారకాతిరుమల, మద్ది ఆంజనేయ స్వామి, తూర్పు యడవల్లి ప్రాంతాలను కలుపుతూ జంగారెడ్డిగూడెం, కామవరపుకోట, చింతలపూడి నుంచి సర్వీస్ ఏర్పాటు చేయాలని కోరినట్లు సభ్యులు వీరమల్ల మధు, ఉయ్యూరు సుభాష్, వీరంకి నాగరాజు తెలిపారు. ఈ మేరకు వినతిపత్రాన్ని అందజేశారు.

104 ఉద్యోగుల నిరసన


అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందిస్తున్న దృశ్యం

వేలేరుపాడు: తమ డిమాండ్లను పరిష్కరించుకునే కార్యాచరణలో భాగంగా 104 ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు వేలేరుపాడు మండలం 104 ఉద్యోగులు నిరసన తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి డ్రైవర్లు బి.అనిల్, జిల్లా ఉపాధ్యక్షుడు, డీఈఓ ఎం.విజయ్ వినతిపత్రం అందజేశారు. 104 సర్వీసులను ప్రభుత్వం గతంలో మాదిరి నిర్వహించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా నిర్వహించాలని కోరారు. యాజమాన్యం వేతనాలు సకాలంలో చెల్లించాలని, పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేసినట్లు వారు తెలిపారు.

సర్వసభ్య సమావేశం ఏర్పాటు

టి.నరసాపురం: ప్రజా సమస్యలు పరిష్కారంలో అధికారులు, ప్రజా ప్రతినిధుల సహకారం అవసరమని జెడ్పీటీసీ సామంతపూడి సూర్యనారాయణరాజు అన్నారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ దారబోయిన లక్ష్మి అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సమన్వయంతో పని చేయాలన్నారు. ఎంపీడీవో వెంకటేశ్వరరావు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఒక భక్తుడు గురువారం రూ. 50,116 లను విరాళంగా అందజేశారు. మండలంలోని దొరసానిపాడుకు చెందిన రిటైర్డ్ హెచ్ఎం ఒబిలిశెట్టి రాధాకృష్ణ బామూరావు తన తండ్రి గంగరాజు పేరున ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమ చేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ ఏఈఓ పి.నటరాజారావు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

ఆశాజనకంగా వరి సాగు

- ఖరీఫ్ సాగుకు అనుకూలించిన వాతావరణం
- మన్యం ప్రాంతంలో ప్రారంభమైన వరికోత పనులు


బుట్టాయగూడెంలో గింజ దశలో ఉన్న వరి పంట

బుట్టాయగూడెం: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో రైతులు వేసిన వరి పంట కంకులతో కళకళలాడుతుంది. సాగుకు వాతావరణ పరిస్థితులు అనుకూలించడంతో దిగుబడులు ఆశాజకంగా ఉండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో వరి నాట్లు సకాలంలోనే రైతులు వేశారు. అదే విధంగా ఈ ఏడాది అధిక వర్షాలు కురిసినప్పటికీ వరి పంట తట్టుకుని నిలబడిందని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు.

నియోజకవర్గంలో 24247 ఎకరాల్లో వరి సాగు

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో పోలవరం నియోజకవర్గంలోని బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, కుక్కునూరు, వేలేరుపాడు, కొయ్యలగూడెం, టి.నర్సాపురం, పోలవరం 7 మండలాల పరిధిలో సుమారు 24247 ఎకరాల్లో రైతులు వరి పంట వేసినట్లు అధికారులు తెలిపారు. బుట్టాయగూడెం మండలంలో 3561 ఎకరాలు, జీలుగుమిల్లి 3020 ఎకరాలు, పోలవరం 6569 ఎకరాలు, కొయ్యలగూడెం 6584 ఎకరాలు, కుక్కునూరు 858 ఎకరాలు, వేలేరుపాడు 1255 ఎకరాలు, టి.నర్సాపురం 2400 ఎకరాల్లో రైతులు వరి పంటలను వేశారు. ప్రస్తుతం వరి పంట పొట్ట దశలో 40 శాతం, గింజ దశలో 40 శాతం ఉండగా 20 శాతం వరి పంట కోత పనులు జరుగుతున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు.

వరి కోతలు ప్రారంభం



ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వరి సాగు ఆశాజనకంగా ఉంది. ప్రస్తుతం పొట్ట, గింజ దశలో పంటలు ఉండగా 20 శాతం పంటల కోతల పనులు జరుగుతున్నాయి. వాతావరణం అనుకూలించడంతో రైతులు పండించిన వరి పంట ఆశాజనకంగా ఉంది.

డి. ముత్యాలరావు,
ఏఓ, బుట్టాయగూడెం మండలం

యంత్రాలతో వరి పంట కోతలు

వరి పంటల కోతలకు ఎక్కువ శాతం మంది రైతులు యంత్రాలనే వినియోగిస్తున్నారు. యంత్రాలను వినియోగించడం ద్వారా సమయం కలిసి రావడంతో పాటు కూలీ ఖర్చు కూడా తగ్గుతుందని రైతులు చెబుతున్నారు. తమిళనాడు నుంచి యంత్రాలను రప్పించి వరి కోతలు కోయిస్తున్నామంటూ రైతులు చెప్తున్నారు. అయితే తక్కువ మంది రైతులు మాత్రమే కూలీలతో వరి పంటలు కోయిస్తున్నారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు


పట్టుబడిన నిందితులతో ఎక్సైజ్ అధికారులు

చింతలపూడి: చింతలపూడి ప్రొహిబిషన్ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని నాగిరెడ్డిగూడెం గ్రామంలో నాటు సారా స్థావరాలపై ఎక్సైజ్ పోలీసులు గురువారం దాడులు నిర్వహించారు. దాడుల్లో నాగిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన భూక్యా సోనియ అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై 50 లీటర్ల నాటు సారాను అక్రమంగా తరలిస్తుండగా పట్టుకుని అరెస్ట్ చేశారు. నాటు సారాను స్వాధీనం చేసుకుని సుమారు 1,000 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు సీఐ పి.అశోక్ తెలిపారు. అదేవిధంగా నాటు సారా తయారీకి అవసరమైన బెల్లం విక్రయిస్తున్న రేపాక గోవర్ధన్‌ను అదుపులోకి తీసుకుని 22 కేజీల బెల్లాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నాగిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన పాత నిందితురాలు భూక్యా బుజ్జిని తహసీల్దార్ ముందు బైండోవర్ చేశారు. దాడుల్లో ఎల్.నరశింహారావు, అబ్దుల్ ఖలీల్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌డీపీ మద్యం పట్టివేత

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం ఎక్సైజ్ అధికారులు ఎన్‌డీపీ మద్యం పట్టుకున్నారు. గురువారం ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని జీలుగుమిల్లి మండలం శివగిరిలో ఆర్అండ్ఆర్ కాలనీలో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో అక్రమంగా ఎన్‌డీపీ మద్యం కలిగి ఉన్న చదల అమరావతి అనే మహిళను, కోపల బాపూజీరెడ్డిని అరెస్టు చేసి, వారి నుంచి తెలంగాణకు చెందిన 37 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ కె.శ్రీనుబాబు తెలిపారు. దాడుల్లో ఎస్సైలు జి.వెంకటలక్ష్మి, ఎస్ఎన్ఎస్ సుబ్రహ్మణ్యం, సిబ్బంది పాల్గొన్నారు.

దేవస్థానం షాపు స్వాధీనం

ద్వారకాతిరుమల: శ్రీవారి దేవస్థానానికి చెందిన ఆళ్వార్ సదనంలోని ఒకటో నెంబర్ షాపును గత కొంత కాలంగా ఒక వ్యాపారి ఖాళీ చేయడం లేదు. దీంతో రెవెన్యూ, దేవస్థానం సిబ్బంది సమక్షంలో గురువారం షాపు తాళాలను పగులగొట్టి, పంచనామా నిర్వహించారు. అనంతరం షాపులోని వివిధ సామాగ్రిని దేవస్థానం గోడౌన్‌కు తరలించి, షాపును స్వాధీనం చేసుకుని, ప్రస్తుత హెచ్చు పాటదారుడికి ఆ షాపును అప్పగించినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

ఎన్నికల కోడ్ ఉల్లం‘ఘనులు’



క్షేత్రంలోని గరుడాళ్వార్ సెంటర్‌లో ఎమ్మెల్యే మద్దిపాటి ఫ్లెక్సీ



బస్టాండ్ అవుట్‌గేట్ ఎదురుగా దర్శనమిస్తున్న డిప్యూటీ సీఎం ఫ్లెక్సీ

ద్వారకాతిరుమల: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ సక్రమంగా అమలు కావడం లేదు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమలలో దర్శనమిస్తున్న టీడీపీ, జనసేన ఫ్లెక్సీలే ఇందుకు నిదర్శనం. అధికారుల కళ్లముందే కోడ్ ఉల్లంఘనలు జరుగుతున్నా తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు.దీంతో అధికారుల తీరుపై ప్రజలు పెదవి విరుస్తున్నారు. క్షేత్రంలోని గరుడాళ్వార్ విగ్రహ కూడలిలోనూ, అలాగే మండల పరిషత్, తహసీల్దార్ కార్యాలయాల ముఖ ద్వారం వద్ద ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ కొందరు టీడీపీ నాయకులు ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. అక్కడే మరో పక్కన ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, రాజమండ్రి ఎంపీ పురంధేశ్వరి, ఎమ్మెల్యే మద్దిపాటి ఫొటోలతో ఉన్న శిలాఫలకం దర్శనమిస్తుంది. అదే విధంగా బస్టాండ్ అవుట్‌గేట్ ఎదురుగా డిప్యూటీ సీఎం ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. అధికారులు వాటి ముందు నుంచే తిరుగుతున్నా చర్యలు చేపట్టకపోవడం గమనార్హం. దీన్ని బట్టి ఎన్నికల నియమావళి పట్ల అధికారులకు ఏమాత్రం గౌరవం ఉందో అర్థమవుతుంది. మండలంలోని పంగిడిగూడెం సెంటర్‌లో సైతం కొందరు తెలుగు తమ్ముళ్లు ఎమ్మెల్యే మద్దిపాటి ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఈ విషయంపై కొందరు స్థానికులు పంచాయతీ అధికారులను నిలదీసినప్పటికీ ఫలితం లేకపోయింది.

బెల్టు షాపులు, సారా విక్రయాలపై కఠిన చర్యలు


సిబ్బందికి సూచనలిస్తున్న అసిస్టెంట్ కమిషనర్

ద్వారకాతిరుమల: గ్రామాల్లో బెల్టు షాపుల నిర్వహణ, సారా తయారీ, విక్రయాలు జరగకుండా కఠిన చర్యలు చేపట్టాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కేవీ నాగ ప్రభు కుమార్ సిబ్బందికి సూచించారు. భీమడోలులోని ఎక్సైజ్ కార్యాలయాన్ని గురువారం సందర్శించిన ఆయన ఏఈఈ అజయ్‌కుమార్ సింగ్, సీఐ బి.సత్యన్నారాయణకు పలు సూచనలిచ్చారు. సర్కిల్ పరిధిలోని భీమడోలు, ఉంగుటూరు, ద్వారకాతిరుమల, నిడమర్రు మండలాల్లో నాటుసారా అమ్మకాలు, మద్యం బెల్టు షాపుల నిర్వహణ, ఎన్‌డీపీఎల్‌పై నిఘాపెట్టి, వాటి విక్రయాలు జరగకుండా చూడాలన్నారు. నాటుసారా కేసుల్లో పట్టుబడ్డ ముద్దాయిలను తహసీల్దార్ల వద్ద బైండోవర్ చేయాలని సూచించారు.

సోషల్ మీడియాకు సంఘీభావం తెలపండి


వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌తో చిటికెన శ్రీనివాస్

కొయ్యలగూడెం: వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియాకు సంఘీభావం తెలిపి వారిలో ఆత్మస్థైర్యం నింపాలని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారని గౌడ సంఘం వర్కింగ్ కమిటీ జిల్లా అధ్యక్షుడు చిటికెన శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ అధినేతను తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో గురువారం కలిసినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఇటీవల వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కన్వీనర్లను లక్ష్యంగా చేసుకుని కక్ష సాధింపు చర్యలకు దిగిందన్న విషయం ప్రజలు గమనిస్తున్నారని, ఈ విషయాన్ని మరింత లోతుగా అట్టడుగు వర్గాల వారికి సైతం అవగాహన కల్పించే విధంగా కృషి చేయాల్సిందిగా పిలుపు ఇచ్చారన్నారు. అమలు కాని హామీలను ఇచ్చి పాలనలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రజల దృష్టిని మళ్లించేందుకే నిరాధారమైన ఆరోపణలను చేస్తుందన్న విషయం సమాజానికి అర్థమైందన్నారు. ఈ సందర్భంగా పోలవరం నియోజకవర్గంలో పరిస్థితుల గురించి వివరించినట్లు, ఆర్అండ్ఆర్ నిర్వాసితుల సమస్యలు అధినేత వద్ద ప్రస్తావించామన్నారు.

దేశాభివృద్ధిలో సహకార సంఘాల పాత్ర కీలకం


సహకార వారోత్సవాల జెండాను ఎగురవేస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: భారతదేశాన్ని అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థగా మార్చడంలో సహకార సంఘాల పాత్ర చాలా కీలకమని జంగారెడ్డిగూడెం పీఏసీఎస్ సీఈవో ఆర్‌వీ లక్ష్మి అన్నారు. 71వ అఖిల భారత సహకార వారోత్సవాలను గురువారం ప్రారంభించారు. పీఏసీ జి.వెంకటేశ్వరరావు సహకార జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా సీఈవో లక్ష్మి, పీఏసీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జవహర్‌లాల్ నెహ్రూ తన జీవితాన్ని సహకార ఉద్యమానికి అంకితం చేశారన్నారు. నవంబర్ 14 నుంచి సహకార సప్తాహ వారాన్ని జరుపుకుంటున్నట్లు తెలిపారు. ఒక్కరు అందరి కోసం, అందరూ ఒక్కరి కోసం అనేది సహకార సంఘాల నినాదమన్నారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి


లింగపాలెం: గ్రంథాలయ వార్షికోత్సవాలను ప్రారంభిస్తున్న మాజీ సొసైటీ అధ్యక్షుడు



జంగారెడ్డిగూడెం: కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీవో కేఆర్ కృష్ణప్రసాద్

జంగారెడ్డిగూడెం: గ్రంథాలయాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుని విజ్ఞానాన్ని పెంచుకోవాలని ఎంపీడీవో కేఆర్ కృష్ణప్రసాద్ అన్నారు. గురువారం శాఖా గ్రంథాలయంలో వారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఎంపీడీవో కృష్ణప్రసాద్ మాట్లాడుతూ గ్రంథాలయంలోని పుస్తక పఠనం, వార్తా పత్రికలు చదవడం వలన విజ్ఞానవంతులవుతారని తెలిపారు. నెహ్రూ ప్రధానమంత్రిగా దేశానికి చేసిన సేవలు, గ్రంథాలయాల ప్రాధాన్యం గురించి వివరించారు. తొలుత బాలల దినోత్సవం, నెహ్రూ జయంతి సందర్భంగా నెహ్రూ చిత్రపటానికి, గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకట రమణయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో, ఎంఈవోలు బి.రాముడు, బి.రాములు, డాక్టర్ ఎస్ఆర్ రంగనాధన్, పాతూరి నాగభూషణం, సీఎం రాజు, కేవీ విశ్వనాథ్, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లింగపాలెం: ధర్మాజీగూడెం శాఖా గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. ధర్మాజీగూడెం మాజీ సొసైటీ అధ్యక్షుడు గారపాటి నాగ బుద్ధ వరప్రసాద్ (బుజ్జియ్య) గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు బీఎస్‌బీఎస్ ప్రకాష్‌రావు, విద్యార్థులు, పాఠకులు, తదితరులు పాల్గొన్నారు.

పోలవరం రూరల్: శాఖా గ్రంథాలయంలో విద్యార్థులు పుస్తక పఠనం చేయడం వల్ల జ్ఞాపక శక్తి మెరుగుపడుతుందని గ్రంథాలయాధికారి జె.సుబ్రహ్మణ్యం అన్నారు. పోలవరం శాఖా గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు, బాలల దినోత్సవం పురస్కరించుకుని గ్రంథాలయంలో విద్యార్థులతో మాట్లాడారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

చింతలపూడి: గ్రంథాలయాలకు పూర్వ వైభవం తీసుకొచ్చి అభివృద్ధి చేసుకోవడానికి సహకరించాలని నగర పంచాయతీ కమిషనర్ డి.పావని అన్నారు. చింతలపూడి శాఖా గ్రంథాలయంలో గురువారం 57వ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో స్థానిక గురుకులం పాఠశాల సంగీత ఉపాధ్యాయురాలు గోదాదేవి, గ్రంథాలయ సహాయకురాలు బట్టు మణి తదితరులు పాల్గొన్నారు.


ద్వారకాతిరుమల: నెహ్రూ చిత్రపటానికి పూల మాలలు వేసి, నివాళులర్పిస్తున్న ఎంఈఓ


చింతలపూడి: నెహ్రూ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న చిన్నారులు


పోలవరం రూరల్: గ్రంథాలయ వారోత్సవాల్లో పాల్గొన్న విద్యార్థులు

విద్యుత్ వైర్లు తగిలి గడ్డి ట్రాక్టర్ దగ్ధం

ద్వారకాతిరుమల: మండలంలోని దేవినేనివారిగూడెంలో విద్యుత్ వైర్లకు తగిలి ఒక గడ్డి ట్రాక్టర్ గురువారం దగ్ధమైంది. వాహనాల రాకపోకలకు అనువైన రోడ్డును ఇటీవల నిర్మించి, దాన్ని ప్రారంభించకపోవడం వల్ల ట్రాక్టర్ వేరే మార్గంలో వెళ్లి ప్రమాదానికి గురైనట్లు తెలుస్తుంది. స్థానికుల కథనం మేరకు దేవినేనివారిగూడెంలోని సొసైటీ రోడ్డును 20 రోజుల క్రితం సీసీ రహదారిగా నిర్మించారు. నిర్మాణ పనులు పూర్తయ్యి రోజులు గడుస్తున్నా ఇంకా ఆ రోడ్డును ప్రారంభించ లేదు. అయితే గుండుగొలను నుంచి దేవినేనివారిగూడేనికరి వచ్చిన ఒక గడ్డి ట్రాక్టర్ రామాలయం వీధిలోంచి వెళుతుండగా పైన విద్యుత్ వైర్లు తగిలి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. నిమిషాల వ్యవధిలోనే ట్రాక్టర్‌కు మంటలు అంటుకున్నాయి. దీంతో డ్రైవర్ చాకచక్యంగా సమీపంలో ఉన్న చెరువులోకి ట్రాక్టరును దింపివేశాడు. అయితే అప్పటికే గడ్డి పూర్తిగా దగ్ధం కాగా, ట్రాక్టర్ ట్రక్కు డోర్లు కాలిపోయాయి.

పంచాయతీల అభివృద్ధిపై శిక్షణా తరగతులు



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎల్‌డీవో

కొయ్యలగూడెం: గ్రామ పంచాయతీల అభివృద్ధి శిక్షణ కార్యక్రమాల్లో తెలుసుకున్న అంశాలను పాలనలో ప్రవేశపెట్టి గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని డీఎల్‌డీవో ఎం.రాజు పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీడీవో కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

లింగపాలెం: గ్రామ పంచాయతీలో పెండింగ్‌లో ఉన్న పనులు, చేపట్టవలసిన అభివృద్ధి పనులకు సంబంధించి ప్రణాళికలను సిద్ధం చేయాలని లింగపాలెం ఎంపీడీవో కె.వాణి సూచించారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని గ్రామ పంచాయతీలు, సచివాలయాల కార్యదర్శులకు, మండల స్థాయి అధికారులతో కలిసి అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

బుట్టాయగూడెం: గ్రామాభివృద్ధికి దోహదపడేలా ప్రణాళికలు రూపొందించాలని డీఎల్‌డీఓ ఎం.రాజు అన్నారు. గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళిక(జీపీడీపీ)పై శిక్షణ కార్యక్రమం ఎంపీడీఓ కె.జ్యోతి అధ్యక్షతన నిర్వహించారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన తప్పనిసరి



చింతలపూడి: మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి


కొయ్యలగూడెం: బ్యాగ్‌లు అందుకున్న విద్యార్థులు


కామవరపుకోట: నెహ్రూ చిత్ర పటానికి నివాళి అర్పిస్తున్న దృశ్యం

ఘనంగా బాలల దినోత్సవం

చింతలపూడి: విద్యార్థి దశనుండే చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి సి మధుబాబు తెలిపారు. గురువారం బాలల దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ హైస్కూల్‌లో బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మధుబాబు మాట్లాడుతూ పిల్లలు ఏకాగ్రతతో చదివి ఉన్నత స్థితికి చేరాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.నాగేశ్వరరావు, ఐసీడీఎస్ పీఓ మాధవి, ఎంఈఓ కిరణ్ బాబు, హెచ్ఎం సుధాకర్, న్యాయవాదులు డేవిడ్ రాజు, ఉమర్ ఫరూఖ్, కేకే దుర్గాభవాని, సోషల్ వర్కర్ ఎండీ అక్బర్ ఆలి, తదితరులు పాల్గొన్నారు.

కామవరపుకోట: మండలంలోని రావికంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వతంత్ర భారత దేశ మొదటి ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ జన్మదినం సందర్భంగా బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమములో ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం: మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో రామచంద్రపురం ఫౌండేషన్ ప్లస్ స్కూల్ నందు బాలల దినోత్సవం సందర్భంగా గురువారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. పిల్లలకు బిస్కెట్స్ అందజేశారు. అలాగే విద్యా వికాస్ విద్యా సంస్థల్లో, భాష్యం స్కూల్‌లోనూ బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ మెంబెర్స్ బి.లతా కుమారి, పెద్దిరాజు , హరి మరియు ప్రిన్సిపల్ కే .వనజ తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ బ్యాగ్‌ల పంపిణీ

కొయ్యలగూడెం: బాలల దినోత్సవ సందర్భంగా గురువారం ప్రభుత్వ పాఠశాల్లో, అంగన్‌వాడీ కేంద్రాలు అదే విధంగా గ్రంథాలయంలో చాచా నెహ్రూ జయంతి కార్యక్రమం నిర్వహించారు. పొంగుటూరు ఎంపీపీ స్కూల్‌లో వారం రోజుల పాటు నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలుగా నిలిచిన ఇరవై మంది విద్యార్థులకు రూ.15 వేల విలువైన స్కూల్ బ్యాగ్స్ పంపిణీ చేశారు. సీపీఐ నాయకులు తాడిగడప ఆంజనేయరాజు, పొంగుటూరు మాజీ సర్పంచ్ కాసకాని వెంకటలక్ష్మి, గోపాలకృష్ణ గోఖలే, పంది ప్రభుదాసు, కోనపాము రవి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.